క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 17, వంకాయ 18, బెండ 23, పచ్చిమిర్చి40, కాకర 23, బీర 18, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 15, కారెట్ 33, దొండ 23, ఆలు 23, ఉల్లి 24, గోకర 28, దోస 18, సొర 11, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 45, అర్వి 35, మునగ 28, చిలగడదుంప 45, బీట్‌రూట్ 21, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 32. ఈధరలు మంగళవారం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

భీమ్‌ఆర్మీ మలక్‌పేట అధ్యక్షుడిగా బొట్టు శ్రీను



మలక్‌పేట: తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ మలక్‌పేట అధ్యక్షుడిగా మూసారంబాగ్ గడ్డిఅన్నారానికి చెందిన బొట్టు శ్రీను నియమితులయ్యారు. ఇటీవల జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వనం మహేందర్, ప్రధాన కార్యదర్శి పెండేకంటి రవికుమార్ చేతుల మీదుగా నియామక పత్రం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

నేడు మెగా జాబ్ మేళా

మలక్‌పేట: తెలంగాణ ప్రభుత్వ యువజన సర్వీసుల విభాగం సహకారంతో ఈనెల 5 వ తేదీన మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల కోరారు. మెరీడియన్ ఫంక్షన్ ప్యాలెస్‌లో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్‌మేళా కొనసాగుతుందని తెలిపారు. వివరాలకు 88867 11991, 90300 47303 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

వరదనీటి సమస్యను పరిష్కరిస్తాం



కాలనీలో వరదనీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలో పలు కాలనీలో వర్షాలు కురిసినప్పుడు నీరు వెళ్లేందుకు వరద కాలువను నిర్మించనున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయకాలనీలో వర్షంనీరు రోడ్లపైనే ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాలనీ వాసులు ఇచ్చిన సమాచారంతో సోమవారం ఆయన కాలనీలో పర్యటించారు. వరదనీటి సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటం చేస్తామని ఎల్‌బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని వాంబేకాలనీ సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాంరెడ్డి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎస్టీ సెల్ చైర్మన్ రమేశ్‌నాయక్, కాలనీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, గుడి చైర్మన్ శ్రీకాంత్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు శ్రీపాల్‌రెడ్డి, హుస్సేన్, మోహన్‌రాథోడ్, రాజు,కుశ, శంకర్,శ్రీశైలం, రవి,కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దర్గా ఉత్సవాలు



మన్సూరాబాద్: డివిజన్ పరిధి చింతలకుంటలోని షరీఫ్ హజ్రత్ సయ్యద్ సాహ అబ్దుల్ ఖాధీర్ షహీద్ దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమైనాయి. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రార్థనలు చేశారు. నిర్వాహకులు ఇమామ్ ఖాసీం, ముజావర్ సయ్యద్, ఖాజాపాష, సయ్యద్‌పాష, సయ్యద్ అన్వర్‌పాష, సయ్యద్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఉప్పల్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఉప్పల్ డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో దాదాపుగా 70 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని, వీరంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన వారని, వెంటనే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఈ నెల 11వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయనున్నట్లు వినతి పత్రంలో తెలిపారు.

వర్షం.. కష్టం

భారీ వర్షం.. కాలనీలు జలమయం..



బీఎన్‌రెడ్డి నగర్‌లో రహదారిపై వరదనీరు

దిల్‌సుఖ్‌నగర్: కురుస్తున్న వర్షానికి మలక్‌పేట్‌జోన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలు ,ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. సోమవారం కురిసిన వర్షానికి కాలనీలు జలమయంగా మారాయి. కాలనీలోని డ్రైనేజీలు రహదారులపై ప్రవహించాయి. ట్రాఫిక్ స్థంభించింది.

- ఆగకుండా కురుస్తున్న వర్షానికి దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్,అక్బర్‌బాగ్,ఓల్డ్‌మలక్‌పేట్, మున్సిపల్ కాలనీ, పద్మనగర్, కాలడేర, మలక్‌పేట్ రైల్వే బిడ్జి, అజంపుర, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాలలోని కాలనీలు, బస్తీలు జలమయంగా మారాయి.
- మలక్‌పేట్, నల్గొండక్రాస్‌రోడ్డు, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం తదిర ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం కావడంతో కొద్దిసేపు రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. వర్షాలకు ఈప్రాంతాల్లోని నాలాలు పూర్తిగా పూడుకుపోయి మురుగునీరంతా రోడ్లపై కాలనీల్లో ప్రవహిస్తోంది. నాలాలలో ఎప్పటికప్పుడు పూడికతీతపనులు చేపట్టక పోవడంతో వరదనీరు ప్రవహించలేకపోతోంది. దీంతో కాలనీలు, బస్తీలు ముంపునకు గురవుతున్నాయి.



వైదేహి నగర్ కాలనీలో రహదారిపై నిలచిన వరదనీరు

పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు..

ఆర్‌కేపురం, సరూర్‌నగర్ మండల పరిధిలోని గ్రామాలు, ఓల్డ్‌మలక్‌పేట్, అక్బర్‌బాగ్, మూసారంబాగ్, సైదాబాద్, కుర్మగూడ, సరూర్‌నగర్ డివిజన్‌లలో డ్రైనేజీ పైపులు లీకై ఎక్కడి డ్రైనేజీ అక్కడనే పొంగిపొర్లుతున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కాలనీలు జలమయం

ఎల్‌బీనగర్: భారీ వర్షం...లోతట్టు కాలనీలు జలమయం...జనజీవనం అతలాకుతలం...వెరసి అధికారుల నిర్లక్ష్యం...ఇదీ ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని పలు కాలనీలలో వరదనీరు సృష్టిస్తున్న బీభత్సానికి నిలువుటద్దం. లోతట్టు కాలనీలు వరద ముంపు సమస్యతో సతమతమవుతున్నా అధికారులు మాత్రం మెద్దు నిద్ర వదలటం లేదనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇప్పటికే చెరువులు, కుంటలు నీరు గరిష్ట స్థాయికి చేరింది. దీనికి తోడు ఆదివారం సాయంత్రం నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షానికి బీఎన్‌రెడ్డి, చైతన్యపురి, లింగోజిగూడ, చంపాపేట, మన్సూరాబాద్ వంటి పలు డివిజన్లలో లోతట్టు కాలనీలు జలమయం అయ్యాయి. కాలనీ అంతర్గత రహదాలు వరద నీటితో నిండిపోవటంతో ప్రయాణీకులు పలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి నాలాల పూడికతీతతో పాటు రహదాలపై నిలచిన వరదనీటిని మళ్ళించాలని బాధిత కాలనీవాసులు కోరుతున్నారు.



జలమయంగా మారిన ఆర్‌కేపురంలోని ప్రధాన రహదారి

అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: మరో రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందుస్త అన్ని చర్యలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ సర్కిల్ అధికారులను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో సర్కిల్ అధికారులతో క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యధిక వర్షపాతం పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. శానిటేషన్ జవానులు నాలాల వద్ద పనిచేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యుత్ అధికారులు వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. ఎస్‌ఎన్‌డీపీ పనులు జరగే ప్రాంతాల్లో మట్టి కరిగి జారిపోయే అవకాశం ఉందని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మ్యాన్‌హోల్స్ ఓపెన్ చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు గమనించి వెళ్లాలని అన్నారు. సమీక్షా సమావేశంలో ఎల్‌బీనగర్ సర్కిళ్ల డీసీలు రవీంద్రకుమార్, దశరథ్, అరుణకుమారి, శానిటేషన్ అధికారులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం వనస్థలిపురంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని రేషన్ డీలర్లతో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల కమిషన్‌ను ఇటీవలే ప్రభుత్వం రూ. 70 నుంచి రూ.140కు పెంచిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న అన్ని సమస్యల పరిష్కారానికి, కమిషన్ రూ. 200 పెంపుకు కృషి చేస్తానని అన్నారు. సమయ పాలనతో అన్ని రకాల నిత్యావసర సరుకులు పేదలకు అందేలా రేషన్ డీలర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు డీలర్లు మాట్లాడుతూ రేషన్ డీలర్స్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంకు 300 గజాల స్థలం ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్, రేషన్ డీలర్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వైకుంఠం, సూర్యప్రకాష్, యాదగిరి, మహేష్‌రెడ్డి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

డబుల్‌బెడ్‌రూం ఇళ్లు స్థానికులకు కేటాయించాలి



మాట్లాడుతున్న బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: ఎరుకల నాంచారమ్మ డబుల్ బెడ్‌రూం సముదాయాల్లో మిగిలిన ఇళ్లను స్థానికంగా నివాసముంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి కోరారు. గత 3 రోజులుగా డబుల్ సముదాయల వద్ద నాంచారమ్మ బస్తీ అధ్యక్షుడు జగన్నాథం గంగయ్య ఆధ్వర్యంలో చేస్తున్న నిరహారదీక్షా శిబిరానికి బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి సోమవారం హాజరై సంఘీభావం తెలిపారు. షుగర్‌లెవల్స్ పడిపోవడంతో దీక్షను విరమింపజేశారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో 70వేల మంది పేదలు డబుల్ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారని, ఇచ్చింది కేవలం 2వేల లోపేనని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సిద్దిని స్వామి, వనం గంగయ్య పాల్గొన్నారు.

నా దరఖాస్తును పరిశీలించండి : వెంకటేశ్

చార్మినార్: ఏఐసీసీ సెక్రటరీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెంకటేశ్ గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవా రం సాయంత్రం గాంధీభవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్‌పార్టీ స్టీరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన మాణిక్ రావు ఠాక్రే, మధుయాష్కీ గౌడ్‌ను వెంకటేశ్ కలిసి రాబోయే శాసనసభ ఎన్నికల్లో చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు. తన దరఖాస్తును పరిశీలించి పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న తనకు పార్టీ టికెట్‌ను కేటాయించాలని వెంకటేశ్ వారిని కోరారు.



రామ్‌చందర్‌రావు త్యాగాలు స్ఫూర్తిదాయకం

అఫ్జల్‌గంజ్: స్వాతంత్ర్య సమరయోధుడు వందేమాతరం రామ్‌చందర్‌రావు త్యాగాలు స్ఫూర్తిదాయకమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. సోమవారం మేరీ మట్టీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా గోషామహల్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారి వద్ద నుంచి మట్టిని సేకరించారు.



అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శేతమధుకర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఐఎస్‌సదన్‌లోని రాజరాజేశ్వరీ నగర్‌లో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలనీలు బస్తీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను స్థానికులు సైతం పరిశీలిస్తుండాలని, అవకతవకలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కాలనీలు, బస్తీలలోని అంతర్గత రహదారులు ఆధునీకరించడానికి అధికారులతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, కాలనీ సభ్యులు శివ, జమున పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి

చంపాపేట: స్వయంభూ కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయాన్ని తెలంగాణా రాష్ట్రానికే తలమానికంగా తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని నూతనంగా ఎన్నికైన ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి అన్నారు. సోమవారం ఆలయ సమావేశ మందిరంలో జిల్లా ఎండోమెంట్ సహాయ కమీషనర్ శేఖర్, జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ సమక్షంలో ఆలయ పాలక మండలి సభ్యులు రఘుమారెడ్డిని చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తూ ప్రమాణస్వీకారం చేశారు. స్వామివారికి ఆయన పాలక మండలి సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితుల మంత్రోశ్చరణలతో చైర్మన్ రఘుమారెడ్డిని ఆశీర్వదించారు.



రఘుమారెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

భారీ గణపతి విగ్రహ మండప పనులు ప్రారంభం



చైతన్యపురి: న్యూ గడ్డిఅన్నారం పీఅండ్‌టీ కాలనీలో శ్రీగణేష్ యువభక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మండప నిర్మాణ పనులను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. 36 అడుగులతో ఎకో ఫ్రెండ్లీ గణపతిని ఏర్పాటు చేస్తున్నామని నిర్వహకుడు శేఖర్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, రాజేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా ప ట్టుదలతో చదవాలని డిప్యూటీ మే యర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బా లాపూర్ మండల కేంద్రంలోని జి ల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కాసేపు పాఠాలు బోధించారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా బాలాపూర్ మండలం నుంచి ముగ్గురు టీచర్లు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌కు టికెట్ ఇవ్వాలని వినతి

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు సుపరిచితుడు ప్రజలను అన్ని విధాలా ఆదుకుని, సమస్యలను పరిష్కరించిన మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌కు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు సీటు కేటాయించాలని సోమవారం డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు కార్యకర్తలు, నేతలతో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వెంకట్రావ్, జగదీష్, నరసింహ, మంగాగౌడ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శుభ ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి



వనస్థలిపురం: ఎల్‌బీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శుభ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ కేంద్రాన్ని మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలసి సోమవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ..సంతానోత్పత్తి లేక బాధపడుతున్న దంపతుల సమస్యల పరిష్కారానికి శుభ ఫెర్టిలిటీ ఒక చక్కటి వేదికగా పనిచేస్తుందన్నారు. నిర్వాహకులు డాక్టర్ ప్రవంతిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు పలువురి అభినందనలు

మలక్‌పేట: సైదాబాద్ మండలానికి చెందిన ఆరుగురు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి–2023 ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు దక్కాయి. న్యూమూసారంబాగ్ జీజీహెచ్‌ఎస్ (మ్యాథ్స్) ఎస్‌ఏ రమాదేవి, కుర్మగూడ జీబీహెచ్‌ఎస్ ఉర్దూ పండిట్ మహ్మద్ అమ్జద్ అలీ, సైదాబాద్ జీబీపీఎస్ ఎస్‌జీటీ ఎన్.నాగలత, కాలాడేరా జీపీఎస్ ఎస్‌జీటీ హృదయ మేరీ, మలక్‌పేట జీపీఎస్ ఎస్‌జీటీ ఉమా లక్ష్మీదేవి, కాచిగూడ జీహెచ్‌ఎస్ సీఏ కె.అనిత ఎంపికయ్యారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటారని అధికారులు తెలిపారు. సైదాబాద్ డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ, పీఆర్‌టీయూ టీఎస్ సైదాబాద్ మండల అధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన వారికి అభినందలు తెలియజేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని శ్రీనిధి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ హాజరై ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. శ్రీకృష్ణుని జననం గురించి దశావతారాల ప్రాముఖ్యత, దుష్టశిక్షణ, శిష్టరక్షణ అన్న గీతోపదేశాన్ని తెలియజేశారు. విద్యార్థులు శ్రీకృష్ణుని జననం, దశావతారాల నృత్యరూపకం ప్రదర్శించారు. కార్యక్రమంలో శ్రీనిధి పాఠశాల చైర్మన్ డా.నల్లపాటి వెంకటేశ్వర్‌రావు, ప్రెసిడెంట్ నల్లపాటి రాజేశ్వరి, ప్రిన్సిపాల్ ఆరుట్ల శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ఉప్పల్: ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాల్సిన బాధ్యత బీజేపీపై ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉప్పల్‌లోని ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్‌లో పంగ ప్రణయ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్దతు మాటలకు, కాగితాలకు పరిమితం చేయకుండా ఆచరణలో పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను విస్మరిస్తే బీజేపీ చారిత్రాత్మక తప్పిదం చేసినట్లు అవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణలో బీజేపీ, కాంగ్రెస్‌లు దొందు దొందేనన్నారు. బుధవారం నుంచి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కలిసి వినతి పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఉద్యమ కార్యచరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి, జిల్లా మహిళా నాయకులు సలోని, వడ్డెపల్లి శివ, పోలిపాక అంజయ్య తోకట నరేష్ తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

రూ.5 లక్షల ఉచిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: బీఎల్‌ఆర్ ట్రస్ట్ ద్వారా పేదలకు అందిస్తున్న రూ.5 లక్షల ఉచిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని బీఎల్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్‌ఎస్ నేత బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంట కాలనీలో ఇన్సూరెన్స్ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకమైన ఆరోగ్యశ్రీ కార్డుతో ఈ పథకంలో రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. దాదాపు 1800 జబ్బులకు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్, బీఆర్‌ఎస్ నేతలు దాసరి కర్ణ, శివకుమార్, అంజి, తుంగ తిరుపతి, రాంచందర్, రమణారెడ్డి, భూపాల్‌రెడ్డి, సుగుణాకర్‌రావు, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9912220363
9505507616 9912220365